ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం ఆగష్టు 2009

FOR PRIVATE CIRCULATION ONLY

# నూతన సహకార సేద్యం ప్రతిపాదనలు - ఒక విశ్లేషణ

మిత్రులారా !

రాష్ట్ర ప్రభుత్వం రైతులతో సహకార వ్యవసాయం ప్రారంభిస్తామని ముందస్తుగా ఎంపిక చేసిన కొన్ని గ్రామాలలో ఈ సంవత్సరం నుంచే ప్రారంభిస్తామని చెబుతూ ఉంది. ప్రభుత్వ ఈ ప్రతిపాదనను డా॥ జి.వి. రామాంజనేయులుగారు (సుస్థిర వ్యవసాయ కేంద్రం, హైదరాబాద్) విశ్లేషిస్తూ ఒక వ్యాసం రాశారు. ఆ వ్యాసాన్ని యధాతథంగా మీకు అందిస్తున్నాము. ఈ వ్యాసంపై రైతులందరూ చర్చించాలని కోరుతున్నాను.

సంక్షోభంలో వున్న రైతాంగాన్ని ఆదుకోవటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈసారి ఇంకొక కొత్త ప్రతిపాదన తీసుకువచ్చింది. ఈ సంక్షోభానికి మూలకారణం చిన్న కమతాల వ్యవసాయం గిట్టుబాటు అని తేల్చి, ప్రత్యామ్నాయంగా చిన్న చిన్న కమతాలను ఒకే పెద్ద వ్యవసాయ క్షేత్రంగా మార్చటానికి, అందులో యాంత్రికీకరణ, పశుపాలన, గ్రామస్థాయి ప్రాసెసింగ్, ఇతరత్రా పనులు చేపట్టటం ఈ ప్రతిపాదన ముఖ్య వుద్దేశం. దీనికోసం ప్రభుత్వం గ్రామం ఒక యూనిట్‌గా రైతుల సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నది. ఈ ప్రతిపాదనలో కీలకమైన అంశాలు

- గ్రామస్థాయిలో రైతులందరు కలిసి ఒక సంస్థని ఏర్పాటు చేసుకుంటారు. ఈ సంస్థ రూపం సహకార సంఘం/సొసైటి/కంపెనీల రూపంలో వుండవచ్చు.
- గ్రామంలో రైతులందరు సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్న సంస్థకు తమ భూముల్ని నిర్దిష్ట ధరకు అమ్మాలి. ఈ ధర మార్కెట్ ధర లేదా ఏకాభిప్రాయంతో నిర్ణయించిన ధర అయివుంటుంది.
- భూమి విలువ, అందులోవున్న ఇతర సదుపాయాలను పరిగణలోకి తీసుకొని అందుకు తగ్గట్టుగా రైతులకు షేర్లు అందజేస్తారు. ఇలా లభించిన షేర్ల ఆధారంగా వారి ఓటు విలువ నిర్ణయమవుతుంది.
- ప్రతి రైతుకి అతడి పొలంలో గడచిన ఐదేళ్ళలో అత్యధికంగా పండిన పంటను కొలబద్దగా తీసుకొని, ఆ మేరకు ఏటా ఆదాయం ఉండేలా సంస్థ గ్యారంటీ ఇస్తుంది.
- పంట ప్రణాళికలు, గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి ఈ సంస్థ అమలు చేస్తుంది.
- సంస్థ నుంచి వైదొలగాలని రైతులు భావిస్తే తన షేర్‌ని ఆ సంస్థలోని ఇతర షేర్‌హోల్డర్‌లకు గాని, సంస్థకుగాని అమ్ముకునే వీలుంటుంది. భూమి వెనక్కి తీసుకునే అవకాశం వుండదు.
- మొత్తం క్షేత్రం విలువకి సరిసమానమైన డబ్బును మూలధనంగా ఐదేళ్ళలో ఉపయోగించుకునేందుకు వీలుగా సంస్థకు ప్రభుత్వం అందజేస్తుంది. మిగిలిన పెట్టుబడిని బ్యాంకుల ద్వారా రుణం అందజేస్తారు.

## ప్రతిపాదనలో సమస్యలు

### పెద్ద కమతాల వ్యవసాయం :

పెద్ద కమతాలతో వున్న నష్టాలు ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు విదితమే. పెద్ద యంత్రాల వాడకం, రసాయనిక ఎరువులు / పురుగు మందుల వాడకం వలన అనేక పర్యావరణ సమస్యలతో పాటు, ఆర్థికంగా నడవలేని పరిస్థితికి వచ్చాయి. అమెరికా, యూరోపు దేశాలలో ఇటువంటి కమతాలు ఎకరానికి రెండు-మూడు లక్షల రూపాయలు కంటే ఎక్కువ పరిమాణంలో సబ్సిడీలు (చాలా సందర్భాలలో ఉత్పత్తి వ్యయం కంటే ఎక్కువగా) అందిస్తేనే నడిచే పరిస్థితులలో వున్నాయి. ఆహారంలో రసాయనాల కలుషితాల సమస్య అందరికి తెలిసిందే. దీనికి తోడు అధికంగా యంత్రాలు, విద్యుత్తు వాడటం వలన వెలువడే గ్రీన్ హౌస్ వాయువుల వలన పర్యావరణ మార్పు (Climate Change) చూస్తున్నాం. చిన్న కమతాలతో పోల్చుకుంటే పెద్ద కమతాలు Energy Efficiency కూడా చాలా తక్కువ.

ఇటీవలనే ప్రపంచ వ్యాప్తంగా 400 వందల మంది వ్యవసాయ, సామాజిక శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో United Nations సహకారంతో నాలుగు సంవత్సరాల పాటు జరిగి ఒక అధ్యయనం (IAASTD-International Assessment of Agricultural Science, Technology and Development, 2008) లో చిన్న కమతాల వ్యవసాయమే మేలైనదని, అభివృద్ధి చెందుతున్న దేశాలలో వున్న చిన్న కమతాలు భవిష్యత్తులో ప్రపంచ ఆహార భద్రతకు ఆధారం అని తేల్చి చెప్పాయి.

### చిన్న కమతాల వ్యవసాయం :

చిన్న కమతాల వ్యవసాయం గురించి ప్రభుత్వం మాట్లాడుతున్న దాంట్లో నిజం కొంచమే వుంది. ఉన్న పొలం చిన్న దైనప్పుడు అందులో పండే పంట ఉత్పత్తి తక్కువ వుండటం, అందువలన ఆదాయం తక్కువ వుండటం జరుగుతుంది. ఐతే చిన్న కమతాలకు అనువైన పద్ధతులు వాడక ఆధునీకరణ పేరుతో బయట వనరుల మీద ఆధారపడి చేసే వ్యవసాయం ఎక్కువ కావటం వలన ఖర్చులు పెరిగి, ప్రభుత్వ విధానాల వలన సరైన సహకారం (సాంకేతికంగా, ఆర్థికంగా) అందివ్వకపోవటం, గిట్టుబాటు ధరలు లభించక పోవటం వలన రైతులు నష్టపోవటం జరుగుతోంది. దీనికితోడు ప్రభుత్వం అనేక ప్రాథమిక రంగాల నుంచి (విద్య, ఆరోగ్యం, నీరు మొ॥) తప్పుకోవటం వలన జీవన వ్యయం పెరిగి సంక్షోభానికి దారితీస్తున్నాయి. అంతేగాని కేవలం చిన్న కమతాలలో ఆధునిక వ్యవసాయ పద్ధతులని అవలంభించలేకకాదు. నిజానికి చిన్న కమతాలలో బహుపంటల విధానం, సేంద్రీయ పద్ధతులను పాటించటం ద్వారా ఉత్పత్తి ఖర్చులు తగ్గటంతో పాటు ప్రతి కమతం ఉత్పాదకత పెంచవచ్చు. చిన్న కమతాలకు అనువైన చిన్న యంత్రాల వాడకం, గ్రామస్థాయిలో అందరికి, చిన్న కమతాలకి కనీస వనరులు కల్పించటం, ఉత్పత్తులను గ్రామస్థాయిలో పోగుచేసి, కలిసి ప్రాసెస్ చేసి, అమ్ముకునే